# 8

# కుటుంబం

"దాన్ని కొట్టకండీ!" అంది అమ్మ.

అన్నయ్య విరిగిపోయిన క్రికెట్ బాట్ పట్టుకుని ఓ పక్కా, నాకు అందుబాటులో దొరికిన రోకలిబండతో నేను ఇంకొక్కపక్కా ఆ కుక్కని చుట్టుముట్టాము.

"ముక్తా, జాగ్రత్త" అంటున్నాడు అన్నయ్య.

అది అక్కణ్ణించి తప్పించుకుని పారిపోవడానికి చివరి ప్రయత్నాలు చేస్తూంది. కాని కదిలివెళ్ళే అవకాశం లేదు. తలమీద కొట్టి చంపివేసే ఉద్రేకంలో ఉన్నా డన్నయ్య. వాడి కళ్లు ఎర్రబడ్డాయి. ఆ కుక్క ఇంతకుపూర్వం నాలుగయిదుసార్లు ఇంట్లో పాలు తాగెయ్యడం, వెన్న పెరుగులు తినెయ్యడం, అన్నాన్ని పప్పును ఎంగిలి చెయ్యడంలాంటి కష్టాలు చాలాపెట్టింది. అవకాశంకోసం ఎదురు చూస్తున్నాడు. సరిగ్గా ఈరోజు ఆ అవకాశం దొరికింది.

ఈరోజు—

నాన్నగారి ఆరోగ్యం బాగాలేదు. ఆయనకి గంట గంటకీ కాఫీచేసి ఇస్తున్నాము. బంధువులు, మిత్రులు చూడడానికి వస్తున్నారు. నిన్న కాఫీలకీ, టీలకీ పాలు రెండు పావులు ఎక్కువ పోయించుకున్నా సరిపోలేదని అమ్మ ఈరోజు మరో నాలుగుపావులు ఎక్కువ పోయించుకుంది. మొత్తం పాలు సుమారుగా తాగివేసి, కొన్ని ఒలకబోసి బయటపడుతూన్న కుక్క కంటబడడంతో అన్నయ్య దాన్ని వంటగదిలోనే ఉంచి విరిగిపోయిన క్రికెట్ బాట్ అందుకున్నాడు.

తప్పదు—

దాన్ని చంపెయ్యాలన్నంత బాధగా ఉంది. కోపంగా ఉంది.

కుక్క పాలు తాగెయ్యడంతో సంఘంలోని గౌరవప్రపత్తు లన్నిటినీ నీట ముంచివేసినంత అయింది. సమీపంలో ఎక్కడా దొరకవు. మళ్ళీ హోటల్‌కి పంపించి కాఫీలు దఫదఫాలుగా తెప్పించాలి. బాధగా ఉంది. హోటల్ కాఫీ నాన్నగారికి అసలు పడదు. ఏం చెయ్యడమో ఈ పాపిష్టి కుక్కల్ని?

అంతలో అమ్మ హాల్లో ఎవరితోనో మాటాడుతున్నదల్లా, మా సందడిచూసి "దాన్ని కొట్టకండీ, వద్దురా విఠల్" అని అన్నయ్యని వారించి "నువ్వు రావే ముక్తా!" అని నన్ను పిలిచింది.

"వద్దా? ఎందుకు వద్దు?" అని అన్నయ్య అమ్మమీద ఉరిమాడు. ఆ కుక్కని ఈ దెబ్బతో ఇంక ఇంటికి రాకుండా చెయ్యాలని అన్నయ్య పట్టుదల.

అమ్మకేక విని నేను కొంచెం వెనక్కి తగ్గాను. సడలించుకున్నాను నా పట్టుదలని కాని. అన్నయ్యమాత్రం "దొంగముండా కుక్క" అని తిట్టాడు. "నీ రోజులు ముగిశాయిలే" అన్నాడు కసిగా.

ఇట్లాంటి సమయాల్లో తిట్లు తినేదాన్ని నేనే. ఇంతవరకూ కాఫీ కాచాను. నాన్నగారితో హెడ్మాస్టరుగారు మాటాడుతూంటే వింటూ ఆఫీస్‌గదిలో నుంచుండిపోయాను. పాలు కుక్కకి పెట్టినందుకు అమ్మ తిడుతుందేమోనని లోపల్లోపల భయం.

ఈ కుక్క బాధ మా ఒక్క ఇంటికేకాదు. మా కాలనీలో ఉన్న ఇళ్ళలో అందరూ దీని బాధ పడలేకుండా ఉన్నారు. ఆమధ్య ఓ రెణ్ణెల్ల క్రితం సినిమాహాల్ ప్రొప్రయిటర్ భార్య వేణ్ణీళ్లు సలసలా కాచి పోసేశారట! దాంతో దాని ఎడంపక్క కాలిపోయి పుండయింది. ఆ పుండు మెల్లిగా ఎలాగో నెల పదిహేనుదినాల తరవాత తగ్గింది. ఇప్పుడు ఆ మచ్చ కనబడుతూంది.

అమ్మ మళ్ళీ "చూలుతో ఉందిరా" అంది.

దానితో అన్నయ్య ఒక్కసారి తన అభిప్రాయాలన్నీ మార్చుకుని బాట్ బొగ్గుల బస్తావేపు విసిరేసి "ఫో!" అని విసుగ్గా అరిచి

లోపలికి వెళ్ళిపోయాడు. అది పోవడానికి దారి ఇచ్చేసి నేను వెళ్ళి పోయాను. ఆ కుక్క పరుగుపరుగున నరకంలోని యమభటులని తప్పించుకున్నట్టు పారిపోయింది!

* * *

రెండువారాల తరవాత కాలేజీనించి వచ్చేసరికి ఇంట్లో అమ్మ లేదు. అన్నయ్యని అడిగితే "డాక్టర్‌గారి గరాజ్‌దగ్గిర ఉంది. కుక్క పిల్లల్ని కన్నది అక్కడే ఉదయంనించీను." అంటూ విసుక్కున్నాడు.

పుస్తకాలు షెల్ఫ్‌లో ఉంచేసి చూడాలన్న కుతూహలంకొద్దీ వెళ్ళాను. చుట్టూ మూక ఉంది. వీధిలోని పిల్లలంతా అక్కడే గుమిగూడారు. మృణాళిని, శోభ, సత్య, అరుణ, బాలా త్రిపురసుందరీ ఆ వింత చూస్తున్నారు. పిల్లలన్నీ ముద్దుగా ఉన్నాయి. కళ్లు మూసికొని ఉన్నాయి. అలా నిద్రలో పడిఉన్నాయి. తల్లిమాత్రం రాజ్యాన్ని జయించిన గర్వంతో ఉంది. తన గొప్పతనాన్ని చూడడానికి ఈ లోకం అంతా తన కాళ్ళదగ్గిరికి వచ్చారనే సంతోషంతో ఉంది. ఏవేవో తెచ్చిపెట్టినట్టున్నారు. రెండు పింగాణీప్లేట్లు ఎంగిలితో కనబడుతున్నాయి.

ఆడజాతి అవడంవల్ల కాబోలు ఆ సానుభూతి మాకు. దాని మాతృత్వవేదన అర్థమయినట్టుంది. చిన్నపిల్లలు తప్పించి మగవాళ్ళు పెద్దవాళ్ళుఎవ్వరూ లేరక్కడ. సుమారు ఓ పదినిమిషాలు నించుని అమ్మనీ, కరుణనీ తీసుకొని వచ్చేశాను.

ఇంకా జనం అక్కడ మిగిలేఉన్నారు. డాక్టరుగారి కుటుంబం ప్రస్తుతానికి అక్కడ లేదు. ఆయన కారుకూడా లేదు. ఆయన ఒక్కరే ఉంటున్నారు. అందుచేత సరిపోయింది. ఆ ఇంటావిడ ఉంటే ఇంతమంది వచ్చేవారుకాదు. ఆమె అంటే కొందరికి పడదు. ఆమె హోదా చలాయిస్తుంది. గర్వం ఎక్కువ. ఎవరి బ్రతుకు వాళ్ళు బ్రతుకుతున్నారేకాని ఆమెను సేవించి బ్రతికే మనుషులు ఎవరూ లేరిక్కడ. అందుచేత ఆమె హోదా ఆమెదగ్గిరే ఉంటుంది.

మూడుదినాలవరకూ ఆ కుక్కమీద ప్రత్యేకమైన అభిమా

నాన్న కురిపించిన కాలనీవాళ్ళంతా తరవాత అంత శ్రద్ధ తీసుకోలేదు. ఆ కుక్కే ఇళ్ళవద్దకి వెళ్ళి ఆకలికళ్ళతో చూసేది. నేను ఇంటిదగ్గిర ఉన్నసమయంలో వస్తే ఏదోఇంత పెట్టేదాన్ని. కాని అది ఒకటి రెండు సార్లు తప్పించి నా తీరికకు అందుబాటుగా రాలేదు. పైగా మా అన్నయ్య ఉన్నప్పుడు ఇలాంటి పనులు చెయ్యటానికి పడదు. "మీకు వేస్ట్ చెయ్యడం బాగా అలవాటయిపోయింది. ఒకసారి క్యూలో వెళ్ళి నుంచోండి తెలుస్తుంది" అని నొచ్చుకుంటాడు.

కరుణ అమ్మతో కుక్కపిల్లని తెచ్చి పెంచే ఆలోచన చేస్తున్నాడు. వాడు మా చిన్నతమ్ముడు. ఏడేళ్లు. 'మూడులో ఉన్నాడు. వాడి కోసమన్నా ఓ కుక్కపిల్లని తెచ్చి పెంచుకోవాలనుకుంటూంది అమ్మ. ఆ పిల్లల్లో గోధుమరంగుతో ఒకటి చురుకుగా ఉంది. మరో రెండు తెల్లవి. నల్ల మచ్చలతో ఒకటి. మరోటి పూర్తిగా నల్లగా ఉంది. తల్లిపాలు విడిచాక ఆ గోధుమరంగు పిల్లని తెచ్చి పెంచుకోవాలని అమ్మ నిశ్చయించుకుంది.

నేను ఆరు చదువుతున్న రోజుల్లో ఒక్కపిల్ల ఉండేది. నాన్నగారి ఆంగ్లోఇండియన్ ఫ్రెండ్ ఇచ్చారు. అల్సేషియన్. అమ్మ 'సురేంద్ర' అని పేరుపెట్టింది. అది ఇంట్లో అందరికీ ఒక ఆట వస్తువుగా ఎంత ఆహ్లాదాన్ని కలిగించేదో! ఆ జ్ఞాపకాలు ఇప్పుడు వేదన కలిగిస్తున్నాయి. సురేంద్ర అకస్మాత్తుగా జ్వరంతో ఒక్క రోజులో చచ్చిపోతే అమ్మ కోలుకోవటానికి ఆరునెలలు పట్టింది. దానితో నాన్నగారికి కుక్కల్ని పెంచడంమీద ఉన్న వ్యామోహం అంతా చచ్చిపోయింది. కావాలనుకుంటే ఇంకా మంచిజాతి కుక్కలు దొరికేవి కాని తెచ్చి అమ్మ మనసు బాధించడం యిష్టంలేక పోయింది.

మళ్ళీ ఇప్పుడు ఈ కుక్కపిల్లకోసం—

ఓ సాయంత్రం వంటపని అంతా పూర్తిచేసుకుని జాకెట్ క్లాత్ శకుంతలాబాయిగారికి కుట్టుకి ఇచ్చి రావాలని వెళుతూండగా ఆ గరాజ్‌లో చిన్న పిల్లల గొంతులు వినిపించాయి. అంతా తొమ్మిది పదేళ్ళలోపలవాళ్ళే. మూడేళ్ళ హెడ్మాష్టరుగా రమ్మాయి,

లెక్చరర్‌గారి మేనల్లుడు, సినిమా ప్రొప్రయిటర్ కొడుకూ—మరీ చిన్నపిల్లలు. అందంగా, ఆరోగ్యంగా, వికసించిన చూపులతో, లలిత మైన ఆలోచనలతో వినోదిస్తున్నారు. ఆరోజు నాకు బాగా గుర్తుండి పోయింది. తల్లి శరీరంమీద గంతులేస్తూ ఆ పిల్లలు పాలు తాగు తున్నాయి.

ఆ పిల్లలను ఆకర్షించిన సత్యం అక్కడ ఏమి ఉందో నాకు తెలుసు.

అదేరాత్రి—

సుమారు తొమ్మిది గంటలకు హెడ్మాష్టరుగారిని ఎరెస్ట్ చేశారు. కాలనీ అంతా ఆశ్చర్యపోయింది. పాపం,ఆయనకు గంపెడు సంతానం. ఆయన తప్పించి వేరే ఆధారంలేని కుటుంబం. పెద్ద పిల్లలు—పదకొండూ, తొమ్మిదీ, ఎనిమిదీ, ఏడూ—చదువుకుంటు న్నారు.చిన్నపిల్లలు నాలుగూ, మూడూ, ఒకటీ తరగతుల్లో ఉన్నారు. మూడేళ్ళ చిన్నమ్మాయి. ఆ ఇంట్లో ఆయన మరదలు ఆత్మహత్య చేసుకుని ఇంకా నెలదినాలు కాలేదు. ఈరోజు మళ్ళీ ఈ విపత్తు ఎదు రయింది. చాలా మంచివాడు. సున్నితమయిన హృదయం ఆయనది. దైవసంబంధమైన, మత సంబంధమైన సంస్థలలో ఆయనకు ఉన్నత గౌరవ పదవు లున్నాయి. సిటీలో మతసంబంధమూ భక్తి. సంబం ధమూ అయిన కార్యక్రమాలలో ఆయన పేరు పేపర్లలో పెద్ద అక్ష రాలలో కనబడుతుంది. స్కూల్లో మంచిపేరు పొందాడు. ఎప్పుడు ఉపన్యాస మిచ్చినా గీతనించీ, వేదాలనించీ, హోలీ బైబిల్‌నించీ, ఖురానే షరీఫ్‌నించీ ఎన్నెన్నో సూక్తులు గుప్పిస్తారాయన, వాళ్ళింట్లో ఏడాదికి రెండుమూడు వ్రతాలు జరుగుతాయి. దేశంలోని పుణ్యతీర్థా లన్నీ తిరిగారు. రోజుకొక్క సాధువుకన్నా భోజనం పెట్టడం ఆ ఇంట్లో అలవాటు. అట్లా 'రామా కృష్ణా' అనుకునే దైవభీతిగల ఆ బ్రాహ్మడు ఏం చేశాడా అని అందరూ ఆశ్చర్యపోయారు.

ఆ రెండో రోజు—

కథ అంతా స్పష్టంగా తెలిసింది. ఎవ్వరూ నమ్మలేనివిధంగా ఉంది. నెలదినాల క్రితంనాటి మరదలు ఆత్మహత్యకీ, ఈ నిర్బం

ధానికీ సంబంధం ఉందనీ, ఆమె ఆత్మహత్య చేసుకోలేదనీ, ఈయన చంపేశాడనీ కొన్ని బలమైన ఆధారాలు దొరికాయట! శవపరీక్షచేసిన అధికారుల్లో లంచం తిన్న ఆచూకీలు తెలిశాయట! దానితో చాలా పెద్ద కల్లోలం రేగింది కాలనీ అంతటా.

ఆ రాత్రి అమ్మా, నాన్నగారూ, అన్నయ్యా ఆ విషయాలు మాట్లాడుకుంటూండగా విన్నాను. కాలేజీలో ఆ హెడ్మాష్టరును ఎరగని విద్యార్థులు లేరంటేనే మంచిది.

ఆ మాటలన్నీ అయిపోయిన తరవాత, ఏ మర్థమయిందో, ఏ ఊహల్లో ఉన్నాడో ఏమిటో కరుణ "అమ్మా, ఆ కుక్కపిల్లల నాన్న ఏడమ్మా?" అని అడిగాడు. అమ్మ వినిపించుకోనట్టు తన స్వంత పనుల్లో మునిగిపోయింది.

వాడి ప్రశ్న ప్రశ్నగానే ఉండిపోయింది.

కుక్కల్లోనూ, పశువుల్లోనూ కుటుంబ వ్యవస్థ లేదనీ,మనుషుల్లోనే ఈ తల్లీ, తండ్రీ, అక్కా, అన్నా, తమ్ముడూ, చెల్లీ అన్న సంబంధా లున్నాయనీ వాడికి అర్థమయ్యేట్టు ఎట్లా చెప్పడమో తెలీక ఊరుకున్నాను.

కుక్కపిల్లలని - తల్లిపాలు విడవకుండానే - అందరూ ఎత్తుకుపోయారు. మేము తీసుకురావాలనుకున్న గోధుమరంగు కుక్కపిల్లని ప్రెస్ మేనేజర్ రాజు తీసుకుపోయాడు. తతిమ్మా పిల్లలు నచ్చలేదు. పైగా లేవుకూడా.

ఇంట్లో కుక్కపిల్ల లేనందుకు అందరకూ ఉన్న గొప్ప ఆనందం తనకు లేనట్టుగా కరుణ బాధపడి పోతున్నాడు. కుక్కపిల్ల సంపాదనకోసం అహోరాత్రాలూ ఊహిస్తున్నాడు. కుక్కపిల్లతో ఆడుకుంటున్న ముచ్చట్లు మిత్రులవద్దనించి వింటున్నాడేమో, మరీ ఉబలాట పడుతున్నాడు.

వాడి బాధ పడలేక అమ్మ "అవి మంచి జాతివి కావురా, వాటి గోళ్ళు లెక్కబెట్టాము కదా, పందొమ్మిదీ పద్దెనిమిదీ ఉన్నాయి.

ఇరవై ఉంచేనే కాని మంచిదికాదు. చెడ్డవయితే వీధుల్లో వాళ్ళని కరిచి చాలా తగాదాలు తెస్తాయి. మంచి కుక్కపిల్లని తెచ్చుకుం దాంలే" అని ఓదార్చింది. వాడికేమయిందో ఏమిటో అప్పటినుంచి మరి కుక్కపిల్ల మాట ఎత్తలేదు.

సరిగ్గా ఆ రోజుల్లోనే హెడ్మాస్టరుగారి కుటుంబం ఆ ఇల్లు ఖాళీచేసి పాత టౌన్‌లోని ఓ చవకబారు ఇంట్లో దిగారు. ఆ పిల్లలూ పెద్దవాళ్ళూ రోడ్లమీద అక్కడక్కడ కనిపిస్తున్నారు. వాళ్ళల్లో ఎంతో మార్పు కనబడింది. దీనంగా మురికిగా ఉన్నారు.

ఈ సంగతి అమ్మతో చెబితే—

"తండ్రి చేసిన తప్పుకి పిల్లలకీ, ఆ తల్లికీ శిక్ష" అని అమ్మ విచారించింది.

హెడ్మాస్టరు ఖాళీచేసిన ఇంట్లో చక్రవర్తి అనే ఓ బెంగాలీ ఆయన ఉంటున్నాడు ఇపుడు. ఆయనకి స్టేషన్ రోడ్‌లో పింగాణీ సామానుల షాప్ ఉందిట!

ప్రెస్ మేనేజర్ రాజుగారి చిన్నమ్మాయి మృణాళిని పుట్టిన రోజు పండుగకు అమ్మతో వెళ్ళాలని తయారవుతూంది. ఆ రోజు కాలేజీలో అమెరికన్ పీస్‌కోర్ మెంబర్ ఉపన్యాసం ఉండడం మూలాన మధ్యాహ్నం క్లాసులులేవు. తొందరగా ఇంటికి వచ్చేసరికి అమ్మ తనతో రమ్మని పిలిచింది.

రాజుగారింట్లో మేం తెచ్చుకోవాలనుకున్న గోధుమ రంగు కుక్కపిల్ల కొంచెం పెద్దదయి అధికారం చెలాయిస్తూంది. వచ్చిన కొత్తవాళ్ళని చూసి మొరగడం, ఇంట్లోవాళ్ళు వారిస్తే, గమ్మని ఊరు కోవడం అలవడ్డాయి. రాజుగారు ఆ కుక్కని రౌడీని చెయ్యాలను కున్నారని వాళ్ళావిడ నవ్వుతూ చెప్పారు. భార్య మాట విని రాజు గారు "పదిమంది రౌడీలకంటె ఒక కుక్క మేలు" అని చెప్పారు. అంతేకాకుండా ఈ రోజుల్లో, ఇల్లాంటి సిటీల్లో కుక్కలు తప్పకుండా అవసరం అన్నారు. ఆయన కుక్కపిల్ల గొప్పతనాన్ని చెప్పుకున్నారు.

వాళ్ళ ఇంటి కాంపౌండ్‌లోకి ఏ కుక్కా (మనుషులు అని కూడా) రాదట! అంత గొప్ప శిక్షణ ఇచ్చారట! పోలీసు కుక్కలకంటె చురుకయిందని పొగిడారు.

అది మేం పెంచుకోవాలనుకొన్న కుక్క!

అమ్మ పెంచితే దాన్ని మనుషులను చూసి భయపడేదాన్నిగా, పిల్లిని చూసి ఇంట్లో దాక్కునేదాన్నిగా చూసేది. పిరికితనం నూరి పోసేది. ఏమంటే 'శాంతిరా' అనేది అన్నయ్యతో. నా ఊహకి నాకే నవ్వు వచ్చి లోలోపల నవ్వుకున్నాను.

ఆరోజే రాజుగారు ఢిల్లీలో గవర్నమెంట్ ప్రెస్‌లో దేనిలోనో ప్రయత్నం చేస్తున్నారనీ, వాళ్ళ అన్నయ్య అక్కడ ఉన్నారనీ, ఆ ప్రయత్నాలు ఫలిస్తే రెండు మూడు మాసాల్లో పోవచ్చనీ తెలిసింది. ఆ మాటే వాళ్ళు గొప్పగా చెప్పుకున్నారు. "మేం ఢిల్లీ పోతున్నాం" అన్న ధోరణిలో.

అక్కణ్ణించి వచ్చేస్తున్నప్పుడు మునిసిపాలిటీ కుక్కల వాన్ వాళ్ళు ఒక మగకుక్క మీదికి తాడుముడి విసిరి బిగించి పట్టుకుని వాన్ లోని గజాల బోనులో పడవేసి తీసుకుపోవడం చూశాము.

ఇంటికి వచ్చేసరికి ఆ తల్లికుక్క దొంగల్లే వెతుకుతూంది. తలుపులన్నీ మూసేయటంవల్ల ఏమీ దొరకలేదు పాపం!

తరవాత కొద్ది క్షణాలలో మంచంమీద కూర్చున్న అమ్మ కళ్ళనిండా నీళ్ళు.

అమ్మ కన్నీరుచూసి నేను మాటాడలేక ఏడ్చాను. అమ్మకి సురేంద్ర గుర్తుకు వచ్చిందో ఏమో అనుకున్నాను.

కొన్నాళ్ళ తరువాత అమ్మే చెప్పింది మాటల సందర్భాన. ఆ రోజు కుక్కల వాన్‌వాళ్ళు తీసుకువెళ్ళిన కుక్క—అంతకు ముందు ప్రెస్ మేనేజర్ రాజుగారు పెంచిన కుక్కేనట! అది వీధుల్లో తిరిగి ఎవరినో కరవటంతో, తగువుకు వస్తారని బెల్ట్ తీసి విడిచి

పెట్టేశారట! అట్లా వీధుల్లో సంవత్సరంనించీ తిరుగుతూందిట! ఆ కుక్కవల్ల ఈ పిల్లలు కలిగాయట! పాపం, ఆ తల్లి కుక్కకి తెలీదు గదా!

అమ్మ, కుక్కల్లో లేనిపోని అనురాగా లున్నాయనుకుని కుటుంబ వ్యవస్థ కల్పించి, ఆ వాన్‌లో తీసుకుపోయిన కుక్కనేమో భర్తగా భావించి, దాని బాధ ఊహించుకొని బాధపడుతూంది.

ఈ కుక్కల కథ మనుషుల కథలాగే ఉంది. దానిలో నాకు ఆసక్తికూడా కలిగింది.

రాజుగారు యీ కుక్కపిల్లను కూడా అట్లాగే చేస్తారేమో!

"అడిగి తీసుకుందామా అమ్మా?" అన్నాను.

"అట్లా ఇవ్వడాయన" అంది అమ్మ.

మేము ఒకప్పుడు దాన్ని పెంచుకుంటే బావుండును అనుకోవడంవల్ల ఈ కథ వినటంవల్ల ఆ కుక్కపిల్లమీద మరింత జాలితో కూడిన అభిమానం కలిగింది.

హెడ్మాస్టరుగారు ఖాళీచేసిన ఇంట్లో ఉంటున్న చక్రవర్తి గారితో రాజుగారికి దోస్తీ బాగా కుదిరింది. రాజుగారు చిన్ననాడు ఏడెనిమిదేళ్ళు ఖరగ్‌పూర్‌లో ఉన్నారట! బెంగాలీ వచ్చుట! దాంతో వాళ్ళ పరిచయం సన్నిహిత మయినట్టుంది.

అనుకున్నట్టుగానే రాజుగారికి ఢిల్లీలో ఉద్యోగం వచ్చింది.

మళ్ళీ అమ్మతో చెప్పాను, ఆ కుక్కపిల్లని అడిగి తెచ్చుకుంటే బావుంటుందని.

"వద్దులేవే. బాగా కరవడం నేర్పించారు. ఇరుగు పొరుగులతో ఇంక పడలేం" అంది అమ్మ.

నేను ఊహిస్తున్నట్టుగానే వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ ఆ కుక్కపిల్లని చక్రవర్తిగారి కిచ్చి వెళ్ళిపోయా డాయన. ఆ కుక్కపిల్ల మాత్రం వారందినాలు బెంగపెట్టుకుని ఒకటే ఏడుపు ఏడిచింది.

*  *  *

సుమారు ఆరుమాసాల తరవాత ఒకసాయంత్రం అన్నయ్యా, నేనూ ఒక ఇంగ్లీషు మేట్నీనించి వస్తున్నాము.

రోడ్డుపక్కగా తల్లి కుక్క నిద్రపోతున్నట్లుగా కనపడింది.

ఇంటికి వచ్చిన తరవాత అమ్మ ఎర్రటి కళ్లు కనిపించాయి. 'ఏమిటి' అని అడగ్గా కరుణ చెప్పాడు, ఆ తల్లి కుక్కని చక్రవర్తి వాళ్ళ కుక్కచేత కరిపించారనీ, పాలు తాగేసిందని చక్రవర్తి కొట్టాడనీ, తరువాత ఆ దెబ్బతో గిలగిల తన్నుకుని మొరిగి మొరిగి ప్రాణాలు వదిలేసిందనీను.

ఎంత విషాదకరమైన, దీనమైన బ్రతుకు కుక్కలది?

అమ్మకు ఆ కుక్కల కుటుంబం అంతా పరిచయం. అవి తనకి సంబంధించిన మనుషులయినట్టు వాటిలో కుటుంబ వ్యవస్థని కల్పించి బాధపడుతూంది. కుక్కల వాన్‌లోని మగకుక్క భర్త అయినట్టు, ఆ తల్లికుక్క భార్య అయినట్టు, చక్రవర్తిగారి కుక్క కొడుకు అయినట్టు, కొడుకే తల్లిని కరిచి చంపినట్టు ఇదీ అమ్మ బాధ!

కుటుంబ వ్యవస్థ లేని కుక్కల జీవితానికీ—కుటుంబ వ్యవస్థ ఉండి సాంఘిక నీతి నియమాలను పాటించని హెడ్మాస్టరుగారి కుటుంబానికీ నాకు భేదం కనిపించలేదు.

చక్రవర్తిగారి కుక్కకి తెలీదా, తను కరచినది కన్నతల్లినే అని?

తెలీకపోవచ్చు.

మనిషికి తెలిసిందా ఏమిటి, జీవితంమీద గంపెడాశతో యౌవనంలో ఉన్న మరదలని?—

---